www.dainamicnews.com
శుభోదయం
# డైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089

తెలంగాణ- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | శనివారం 3 అక్టోబర్ 2026 | వెల : 4/-

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు



- మండే ఎండల వేళ ఐఎండి గుడ్‌న్యూస్
- కేరళలో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు
- అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం
- తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు
- ఏపీ, రాయలసీమలో బలమైన ఈదురుగాలుల హెచ్చరిక

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా
# సెంట్రల్ కిచెన్లు



- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ సీఎం సమక్షంలో ఒప్పందం
- దీనిలో భారంగా రూ. 9 కోట్ల విరాళాన్ని అందజేశాయి.
- కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంస్థల సాయం
- క్యాలరీలను లెక్కించడానికి యాప్ వినియోగించాలి

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్లను డిసెంబరు 9న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నవంబర్ 30 నాటికి కిచెన్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ నాగర్‌కర్నూల్‌లో కిచెన్ కోసం రూ.5.17 కోట్ల చెక్కు ఇచ్చింది. వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కిచెన్ కోసం చైన్ ల్యాబ్స్ - మిగతా3లో

### వివక్ష లేని సమాజ నిర్మాణమే
## ప్రభుత్వ లక్ష్యం

- గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి
- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు



హైదరాబాద్

గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా - మిగతా3లో



## జాతిపితకు ఘన నివాళి

- మహాత్మా గాంధీకి ప్రధాని మోదీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి నివాళి
- రాజ్‌ఘాట్‌లో బాపూజీకి అంజలి ఘటించిన ప్రధాని మోదీ
- నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా
- విజయ్‌ఘాట్‌లో శాస్త్రికి నివాళులర్పించిన ప్రధాని, ప్రముఖులు

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

- కాంగ్రెస్ జనతా పార్టీ డిమాండ్
- ముంబయి శివాజీ పార్క్‌లో భారీ నిరసన
- ముంబయి శివాజీ పార్క్ కేంద్రంగా కాంగ్రెస్ జనతా పార్టీ నిరసనలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- సీజేపీకి వ్యతిరేకంగా ముంబైలోనే జెన్ నెక్స్ట్ ముంబై బృందం కూడా ఆందోళనలు



## ప్రజా పాలనకు గాంధీజీ
# ఆశయాలే కీలకం

- మహాత్ముడికి గవర్నర్, సీఎం నివాళులు
- గాంధీ మహాత్ముడి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో ఆయన సమాధికి గవర్నర్, సీఎం నివాళులు
- గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు.
- సత్యం, అహింస, స్వావలంబన, గ్రామ స్వరాజ్యం, సామాజిక సమానత్వం గాంధీ ఆశయాలకు పునాదులు
- గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో శాంతి, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్

గాంధీ మహాత్ముడి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ఆయన సమాధికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. వారితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా బాపూజీకి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం అహింసనే ఆయుధంగా మలచి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ మానవాళికి సత్యం, శాంతి, మానవత్వం నేర్పిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన గాంధీజీ చిత్ర ప్రదర్శనను గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి తిలకించారు. అనంతరం డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్‌తో కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్? గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సత్యం, అహింస, స్వావలంభన, గ్రామ స్వరాజ్యం, సామాజిక సమానత్వం గాంధీ ఆశయాలకు పునాదులని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో - మిగతా3లో



## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

- 'సర్'లో తొలగించిన అర్హులను ఓటర్ జాబితాలో చేర్చాలని ఆదేశాలు
- దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనలు
- దీంతో కీలక ప్రకటన చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- సర్ ప్రక్రియలో తొలగించిన అర్హులైన ఓటర్లను ఓటర్ జాబితాలో చేర్చాలని ఆదేశాలు జారీ

## నామమాత్రంగానే
# స్పందన

- కొత్త ఓటర్ల నమోదుకు 4.43 లక్షల దరఖాస్తులే
- సమయం దగ్గర పడుతున్నా పట్టింపు కరవు
- రాష్ట్రంలో సర్ ప్రక్రియలో భాగంగా మొత్తం 73.39 లక్షల ఓట్లను తొలగించారు
- వీరంతా ఫారం-6 ద్వారా పెద్ద మొత్తంలో రిజిస్టర్ చేసుకుంటారని అధికారులు భావించినా ఇప్పటికీ 4.43 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.



హైదరాబాద్

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో ఫిర్యాదులు, అభ్యంతరాలకు గడువు దగ్గర పడుతున్నా ప్రజల నుంచి స్పందన నామమాత్రంగానే కనిపిస్తోంది. వీటిలో ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6కు పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తాయని రాష్ట్ర ఎన్నికల అధికారులు అంచనాలు వేసినా, అవన్నీ తారుమారయ్యాయి. తెలంగాణలో సర్ సర్వేలో - మిగతా3లో

# డ్రై డే నాడే మద్యం విక్రయాలు?

పెద్దశంకరంపేటలో యథేచ్ఛగా దందా?
డైనమిక్ న్యూస్ ప్రతినిధి, పెద్దశంకరంపేట
గాంధీ జయంతి సందర్భంగా డ్రై డే అమల్లో ఉన్నప్పటికీ పెద్దశంకరంపేటలో కొన్ని ప్రాంతాల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక దుకాణాలు మూసివేసినప్పటికీ వెనుక ద్వారాలు, బెల్టు దుకాణాల ద్వారా మద్యం అందుబాటులోకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

**రెట్టింపు ధరలకు విక్రయాలు?**



సాధారణ ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డ్రై డే నిబంధనలు అమల్లో ఉన్న సమయంలోనూ విక్రయాలు జరుగుతున్నాయనే ప్రచారంపై ఎక్సైజ్, పోలీసు శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల నిఘాపై ప్రశ్నలు**

అక్రమ విక్రయాలు నిజమైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అధికారులపై వస్తున్న ఆరోపణలపైనా ఉన్నతాధికారులు వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు.

# అప్పుల ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

కుషాయిగూడలో

**మేడ్చల్ -మల్కాజ్ గిరి అక్టోబర్ 02 శుభోదయ డైనమిక్ :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో 39 ఏళ్ల వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు ముక్కెర నర్సింహులు (39) డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గాంధీనగర్‌లో నివసిస్తున్నాడు. సుమారు ఆరు నెలల క్రితం కొత్త ఇల్లు నిర్మించడంతో అప్పులు ఏర్పడ్డాయని, వాటి కారణంగా నర్సింహులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు భార్య కవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.
అప్పుల విషయమై అక్టోబర్ 1 రాత్రి భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిపారు. అక్టోబర్ 2 ఉదయం సుమారు 5 గంటలకు నిద్రలేచి చూడగా, నర్సింహులు బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై తప్పుడు ప్రచారాలకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టీకరణ

**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 02, సూర్యాపేట :** నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నా పేరును పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ, కాంగ్రెస్ అభ్యర్థిగా నేను ఎన్నికల బరిలో నిలుస్తున్నాను. అయితే నా అభ్యర్థిత్వంపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. టికెట్ అడగలేదు, ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి సిద్ధంగా లేరు, చేతులెత్తేశారు, యూ టర్న్ తీసుకున్నారు అంటూ ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం. నేను ఎప్పుడూ ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి తప్పుకుంటానని చెప్పలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడం నా స్పష్టమైన నిర్ణయం పార్టీ నాకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో స్వీకరిస్తున్నాను. పట్టభద్రులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ, ప్రభుత్వం మరియు సంబంధిత వేదికల దృష్టికి తీసుకెళ్లడం నా ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను నేను ఎన్నికల బరిలో ఉన్నాను పట్టభద్రుల ఆశీస్సులతో ముందుకు సాగుతాను.



# ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సును జయప్రదం చేయాలి

నేరేడుచర్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సదస్సు

**నేరేడుచర్ల, - శుభోదయ డైనమిక్ వార్త** అక్టోబర్ 6న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సదస్సు విజయవంతం కోసం నేరేడుచర్ల మండలంలో శుక్రవారం సన్నాహక సదస్సు నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**పెద్ద సంఖ్యలో తరలిరావాలి**

ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే జాతీయ ప్రతినిధుల సదస్సుకు ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండపల్లి ఆంజనేయులు మాదిగ, తుంగతుర్తి మండల ఇన్‌చార్జి ఇంజమూరి మల్లయ్య మాదిగ, సీనియర్ నాయకులు బచ్చలకూరి ప్రసాద్ మాదిగ, ఎడవల్లి చంద్రయ్య మాదిగ, వడ్లమూడి ఉపేందర్, మిడతపల్లి శీను, కొత్తపల్లి రవి, ఇంజమూరి పున్నయ్య, లంకెపల్లి ముత్తయ్య, మాతంగి బిక్షం, పెద్దపంగా కరుణాకర్, ఆరే శ్రీకాంత్, నకరికంటి రామకృష్ణ, దోరేపల్లి వెంకటేష్, పాల్వాయి మధు, పల్లె విజయ్, ఆదిమళ్ల బాబురావు, దేశపాక రమేష్, కనకరాజుల రాంబాబు, పాలారపు నరేష్, గోపి, నరేష్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ కొలువులకు బాటలు..!

45 రోజుల ఉచిత శిక్షణకు శ్రీకారం..!
ఆదివారం 4న స్క్రీనింగ్ టెస్ట్..!
హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు..!

**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్:** పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా 45 రోజులపాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు తెలిపారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు రాత పరీక్షతో పాటు శారీరక సామర్థ్య పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేలా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 4వ తేదీ ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌వుడ్ స్కూల్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అర్హులైన అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 45 రోజులపాటు శిక్షణతో పాటు వసతి, భోజనం పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు.రాత పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో సమగ్ర సిలబస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పోలీస్ గ్రౌండ్‌లో నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో ప్రతిరోజూ ఫిజికల్ ఈవెంట్స్‌పై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న హుజూర్‌నగర్ నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ చరమంద రాజు సూచించారు.




## సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు యల్లావుల రాములు మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశానికి అహింస, సత్యాగ్రహం, సత్యం, శాంతి మార్గాలను చూపిన మహనీయుడని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఆయన చూపిన అహింసా మార్గం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంబాల శ్రీనివాస్ , జెట్టి ప్రసాద్ , యల్లావుల రమేష్, బత్తిని మల్లయ్య, సోమగాని కృష్ణ, బంటు నర్సయ్య, బంటు వెంకటేశ్వర్లు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. తదనంతరం సోమ గాని లక్ష్మి పండ్లు, ఫలహారాలు, బిస్కెట్లు పంచిపెట్టారు.



## సకల దేవతల స్వరూపం గోమాతకు ప్రత్యేక పూజలు



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్** రూరల్ :హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని శ్రీ ఆది వరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి ఆలయంలో జై శ్రీమన్నారాయణ నామస్మరణల మధ్య సకల దేవతల స్వరూపంగా భావించే గోమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా భక్తులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం జై శ్రీమన్నారాయణ నామస్మరణలతో, భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భిక్షం గౌడ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్త ఎరగాని సతీష్, భక్తులు శ్రీనివాసు, సునీత ఉపేందర్, రాజేశ్వరి, నవ్య నందు, సాంబశివరావు, ఎరగాని గురవయ్య, సురభి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, కమిషనర్ హన్మంత రెడ్డి




**శుభోదయ డైనమిక్ -- సూర్యాపేట**, గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, కమిషనర్ హన్మంత రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాంధీ అహింస, సత్యాగ్రహం, పరిశుభ్రతను, శాస్త్రి నిజాయితీ, క్రమశిక్షణ, దేశసేవకు ప్రతీకలుగా నిలిచారని అన్నారు. వారి ఆశయాలను నేటి తరాలు ఆచరించాలని సూచించారు. 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఎం.డి. షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్లు అంగిరేకుల నాగార్జున, కుమ్మరికుంట్ల వేణు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరించాలి

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

శుభోదయం డైనమిక్ వార్త -- కోదాడ, కోదాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఓరుగంటి పాండు, కార్యదర్శి ఉప్పల అశోక్, కోశాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వక్తలు పేర్కొన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ వంగవీటి నాగరాజు, జోన్ చైర్మన్ షేక్ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సర్వీసెస్ జగని ప్రసాద్, ఐపీసీ వంగవీటి లోకేష్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చల్లా లక్ష్మీ నరసయ్య, ఎంఈఓ షేక్ సలీం పాషా, వాసవి క్లబ్ సీనియర్ నాయకులు వంగవీటి శ్రీనివాసరావు, గరినే శ్రీధర్, యాదా బ్రహ్మం, యాద సుధాకర్, తవిడిశెట్టి నాగేశ్వరరావు, చిత్తలూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




## 170 క్వింటాళ్ల రేషన్ బియ్యం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్ :** గత నెల 2వ తేదీన హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మాధవరాయనిగూడెం వద్ద పట్టుబడిన 170 క్వింటాళ్ల రేషన్ బియ్యం కేసులో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.
తాజాగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న తిరువీధుల శ్రీనివాసరావు అలియాస్ నకరికంటి శ్రీనివాసరావు, తండ్రి హనుమంతరావు, పల్నాడు జిల్లాకు చెందిన వ్యక్తిని శుక్రవారం హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.
రేషన్ బియ్యం అక్రమ తరలింపు, నిల్వకు సంబంధించి నమోదైన ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు, తాజాగా ప్రధాన నిందితుడిని కూడా అదుపులోకి తీసుకోవడంతో కేసు దర్యాప్తు మరింత కీలక దశకు చేరుకుంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గాంధీ ఆశయాలు ఆచరణీయం



**కోదాడ,శుభోదయ డైనమిక్** మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని గాంధీ పార్కు, బస్టాండ్ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామరస్య మార్గాలు నేటికీఆచరణీయమన్నారు. కులమత భేదాలకు అతీతంగా సోదరభావంతో ఐకమత్యంగా జీవించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి




**మేడ్చల్-మల్కాజ్‌గిరి, శుభోదయ డైనమిక్** జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం నూతన మీడియా చట్టాన్ని తీసుకురావాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణలు పునరుద్ధరించాలని, కొత్త వేతన బోర్డు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు.

**ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు పరిష్కరించాలి**

రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత కార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు ఆరోగ్య సదుపాయాలు పునరుద్ధరించాలని కోరారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే వివిధ ప్రెస్‌క్లబ్‌ల ప్రతినిధులు, జర్నలిస్టులు, ఏఐవైఎఫ్ నాయకులు కే. ధర్మేంద్ర, టి. సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోతెలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**శుభోదయ డైనమిక్ న్యూస్.మోతె** అక్టోబర్ 2 మోతె మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్. కృష్ణ వంశీ, పర్యవేక్షకురాలు కె. విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పుష్ప ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించగా, కార్యాలయ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

## గాంధీ ఆశయాలు ఆచరణీయం

అహింస, శాంతి, సామరస్యాలతోనే సమాజ అభివృద్ధి

**కోదాడ, శుభోదయ డైనమిక్ వార్త** మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని గాంధీ పార్క్, బస్టాండ్ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ ఆచరణీయమని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ఐకమత్యం, సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, రాయపూడి మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో మంచి రోజులను యాది చేసుకుందాం

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, -- శుభోదయ డైనమిక్ వార్త** పేదింటి ఆడబిడ్డల పెళ్లికి మేనమామలా అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు నేటితో 12 ఏళ్లు పూర్తయ్యాయని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేలాది కుటుంబాలకు స్వయంగా చెక్కులు అందించిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కళ్యాణ లక్ష్మి సాయం సకాలంలో అందక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆడబిడ్డల కష్టాలు తీర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.

## నేరేడుచర్లలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి: మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి



**నేరేడుచర్ల, అక్టోబర్ 2 ,శుభోదయ డైనమిక్ న్యూస్** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నేరేడుచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**సత్యం, అహింసా మార్గాలు ఆదర్శం**

మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి సూచించారు. సమాజంలో శాంతి, ఐక్యత, స్వచ్ఛతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు.

**ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనడం**

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్ గుగులోతు రవీందర్ నాయక్, 13వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి లక్ష్మయ్య, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ.20,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును హుజూర్‌నగర్ పట్టణం 2వ వార్డు మల్లన్న నగర్‌కు చెందిన శ్రీమతి బూరుగు కన్యాకుమారికి కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులైన వారికి చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామని కౌన్సిలర్ తెలిపారు.

## నరసింహపురంలో ఘనంగా గాంధీ జయంతి

వికసిత్ గ్రామపంచాయతీ ప్రత్యేక గ్రామసభలో పలు తీర్మానాలు ఏకగ్రీవం



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- మునగాల**,నరసింహపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వికసిత్ గ్రామపంచాయతీ ప్రత్యేక ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనకు ప్రజలంతా ఐకమత్యంతో కృషి చేయాలని అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు తదితర పనులు చేపట్టి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో తమ భూముల్లో వ్యవసాయ బావులు, ఫారం పాండ్లు, చేపల చెరువులు నిర్మించేందుకు ముందుకు వచ్చిన రైతులను సన్మానించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు, మహిళలు, యువత, అంగన్వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోతెలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతె సెప్టెంబర్ 2** మోతె మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్. కృష్ణ వంశీ, పర్యవేక్షకురాలు కె. విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పుష్ప ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించగా, కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ సుజిత్ కుమార్.ఆర్ఐ. కరుణాకర్ రెడ్డి. రమేష్. జి పి ఓ లు. జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



**కాప్రా/కీసర, శుభోదయ డైనమిక్** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐజేయూ పిలుపుమేరకు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా నుంచి కాప్రా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి డి. వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ సమగ్ర మీడియా కమిషన్, నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో క్యాష్‌లెస్ వైద్యం అందించే హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు టి. మల్కయ్యతో పాటు వివిధ ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు, జర్నలిస్టులు, ఏఐవైఎఫ్ నాయకులు కే. ధర్మేంద్ర, టి. సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**శుభోదయ డైనమిక్ న్యూస్, సూర్యాపేట** మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన గాంధీజీ సేవలుచిరస్మరణీయమన్నారు. సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం వంటి ఆయన విలువలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో కుందమల్ల శేఖర్, షేక్ అబ్దుల్ కరీం, పబ్బు వెంకన్న, లింగా నాయక్, బంధం విష్ణు నాని, మహిళా కాంగ్రెస్ నాయకులు రమాదేవి, శిరీష, రేణుక, లలితతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుషాయిగూడ సోనియా గాంధీ నగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ.




**మేడ్చల్ - మల్కాజిగిరి అక్టోబర్ 02 శుభోదయ డైనమిక్ :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ కాలనీలో శుక్రవారం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో ముందస్తుగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.చీరల కోసం వందలాది మంది మహిళలు క్యూలో బారులు తీరారు. సోనియా గాంధీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుందనపల్లి సిద్ధిరాములు ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆధార్, రేషన్ కార్డుల ఆధారంగా అర్హులైన మహిళలకు చీరలను అందజేశారు.ఇందిరమ్మ చీరలు నాణ్యతగా ఉన్నాయని, రంగులు ఆకర్షణీయంగా ఉన్నాయని పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

## రైతుల కరెంట్ కష్టాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

15 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి : చీకూరి లీలావతి



శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ రూరల్ : హుజూర్నగర్ మండలం గోపాలపురం గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీకూరి లీలావతి మాట్లాడుతూ.. లో-వోల్టేజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోకుండా సకాలంలో విద్యుత్ సరఫరా చేయాలి. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని చీకూరి లీలావతి డిమాండ్ చేశారు.

## మేడ్చల్ కలెక్టరేట్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 02 శుభోదయ డైనమిక్ :** భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని సత్యం, అహింస మార్గంలో నడిపించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) ఎం. శివప్రసాద్ తదితర ఉన్నతాధికారులు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజాసేవతో పాటు నిత్య జీవితంలోనూ మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి, నైతిక విలువలు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, వివిధ జిల్లా శాఖల ఉద్యోగులు పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు.

# మహాత్ముల అడుగుజాడల్లో నడవాలి

నేర ప్రవృత్తిని విడనాడాలి: ఎస్పీ కె. నరసింహ




**శుభోదయ డైనమిక్ న్యూస్ -- సూర్యాపేట**మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, ధర్మం మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. లాల్ బహదూర్ శాస్త్రి "జై జవాన్--జై కిసాన్" నినాదంతో దేశ రక్షణ, వ్యవసాయ రంగాల ప్రాధాన్యతను చాటారని గుర్తుచేశారు. నేర ప్రవృత్తి, ఇతరులను ఇబ్బందులకు గురిచేసే తత్వాన్ని విడనాడి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహానుభావుల ఆశయాలను ఆచరించడమే వారికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 45 రోజుల ఉచిత పోలీసు శిక్షణకు ఎంపిక పరీక్ష

**శుభోదయ డైనమిక్ న్యూస్ -- సూర్యాపేట బ్యూరో** ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 45 రోజుల ఉచిత పోలీసు శిక్షణ నిర్వహించనున్నారు. శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం అక్టోబర్ 4న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ తెలిపారు. పరీక్షా కేంద్రాలు: సూర్యాపేట--శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, కోదాడ--కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్--గ్రీన్‌వుడ్ పాఠశాల, తిరుమలగిరి--జెడ్పీ ఉన్నత పాఠశాల.

**పరీక్షకు పోలీస్ ఉద్యోగ దరఖాస్తు, ఉచిత శిక్షణ**

దరఖాస్తు, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలి. ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసి సూర్యాపేటలో 200, కోదాడలో 200 మందికి 45 రోజుల పాటు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ అందించనున్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించి హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు.

# గాంధీ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలి



**నల్గొండ బ్యూరో,శుభోదయ డైనమిక్** మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా నల్గొండ రామగిరిలోని బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అహింస, సత్యం, మతసామరస్యం, కుల వివక్ష నిర్మూలన కోసం గాంధీజీ చేసిన పోరాటం ఆదర్శనీయమన్నారు. గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన సూచించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సమానత్వం, లింగ సమానత్వం, నవ సమాజ నిర్మాణానికి గాంధీజీ ఆశయాలు మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జైలు నుంచి బయటకు వచ్చాక గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి







**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** .జైలు జీవితం నుంచి బయటకు వచ్చిన తర్వాత మహాత్మా గాంధీజీని ఆదర్శంగా తీసుకుని మంచి జీవితాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఖైదీలకు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, చదువుతో పాటు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. చదువు రాని ఖైదీలకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బోధకులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా లక్ష్యంతో జీవించాలని, ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. "పాఠశాలలో ఎక్కువ మంది, జైల్లో తక్కువ మంది ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది" అని అన్నారు. జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కె. కవిత, సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు, అదనపు ఎస్పీ రమేష్ ఖైదీలు చట్టాలు తెలుసుకుని, మానవతా విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా మారాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ కె. ఆనందరావు, డాక్టర్ కిరణ్, జైలర్ అచ్చయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు కలెక్టర్, న్యాయమూర్తులు బహుమతులు అందజేశారు.

# శ్రీనివాసపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్ నగర్ రూరల్** : శ్రీనివాసపురం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జింకల వీరాంజనేయులు, వార్డు సభ్యులు తురక గోపాలరావు, రచ్చ సంజీవ్ గాంధీ, జిపిఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఏఈఓ ముస్తఫా, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.150కే బిర్యానీ.. దసరా లక్కీ డ్రాలో 20 కేజీల గొర్రెపోతు!

**డైనమిక్ న్యూస్ -- హుజూర్ నగర్**:దసరా పండుగను పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలోని తెలంగాణ బిర్యానీ పాయింట్ ఆధ్వర్యంలో వినూత్న దసరా ఆఫర్‌ను ప్రకటించారు. కేవలం రూ.150కే బిర్యానీ అందించడంతో పాటు, లక్కీ డ్రా ద్వారా 20 కేజీల గొర్రెపోతును గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ బిర్యానీ పాయింట్ అధినేత ధూపాటి శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు రూ.150కు బిర్యానీ కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి లక్కీ డ్రా కూపన్ అందజేస్తామని తెలిపారు. ఈ కూపన్లలో నుంచి లక్కీ డ్రా ద్వారా ఒక విజేతను ఎంపిక చేసి, వారికి 20 కేజీల గొర్రెపోతును బహుమతిగా అందించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 19వ తేదీ సాయంత్రం లక్కీ డ్రా నిర్వహించి విజేత కూపన్‌ను ఎంపిక చేయనున్నట్లు ధూపాటి శ్రీనివాస్ తెలిపారు. దసరా పండుగ సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక అనుభూతిని అందించడంతో పాటు, బిర్యానీ ప్రియులను ఆకట్టుకునేలా ఈ వినూత్న ఆఫర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక దసరా ఆఫర్‌ను బిర్యానీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# గాంధీ జయంతి మతసామరస్య దినోత్సవంగా నిర్వహణ

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు నివాళులు



**శుభోదయ డైనమిక్ న్యూస్, నేరేడుచర్ల,** సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని మతసామరస్య దినోత్సవంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస, సత్యమే గాంధీజీ చూపిన శాశ్వత మార్గాలని, నేటితరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఇంకా పూర్తిగా సాకారం కాలేదని, ఉపాధి లేక పల్లెల నుంచి వలసలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గాంధీ జయంతిని మతసామరస్య దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, ముత్యాల భాస్కర్, బత్తిని శ్రీనివాస్, డి. నిఖిల్, చక్రవర్తి, సందీప్, మనోజ్, ఎస్కే సయ్యద్ పాషా, చింతకాయల రవి, రామబ్రహ్మం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు




**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా చైర్‌పర్సన్ లయన్ బట్టు మధు పాల్గొని గాంధీ అహింసా మార్గం, శాస్త్రి దేశసేవ చిరస్మరణీయమన్నారు. విద్యార్థులు వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో సరికొప్పుల నాగేశ్వరరావు, గుండా సత్యనారాయణ, లాయర్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల బాటలో పయనిద్దాం

గాంధీ, శాస్త్రి ఆశయాలు ఆచరణీయం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్







**శుభోదయ డైనమిక్ న్యూస్, సూర్యాపేట** మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శాలు ఎప్పటికీ ఆచరణీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గాంధీ 157వ జయంతి, శాస్త్రి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, సత్యాగ్రహం ద్వారా గాంధీజీ ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించారని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంతో బలమైన భారత్ నిర్మాణం సాధ్యమన్నారు. రైతులు, సైనికుల సేవలను గుర్తించి శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్--జై కిసాన్' నినాదం చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించి, వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఈడీఎస్సీ కార్పొరేషన్ రాగి ఉపేందర్ రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోతే మండలంలో రాఘవాపురం గ్రామసభలో జడ్పీసిఓ



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే అక్టోబర్2** మోతే మండలంలోని గాంధీ జయంతి సందర్భంగా రాఘవాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా జడ్పీ సి ఓ శిరీష పాల్గొనడం జరిగింది ఈ గ్రామ సభ యొక్క ప్రాధాన్యత మరియు 14 రకాల డిపార్ట్మెంట్ గురించి గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది. వాళ్లకు కావలసిన 14 రకాల డిపార్ట్మెంట్ ల గురించి ఏవే పనులు కావాలో అవలను గ్రామపంచాయతీ గారికి అప్లికేషన్ రూపంలో ఇవ్వమని ప్రజలకు సూచించడం జరిగింది మరియు గ్రామ సభ భాగంగా విలేజ్ మ్యాప్ ను కూడా పరిశీలించడం జరిగింది అదేవిధంగా గ్రామ సభలో నివసించాలని రిజిస్టర్లు కూడా సెక్రెటరీ పల్లెల రేణుక కి చెప్పడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ మద్ది మంజుల ఏపిఓ నగేష్ ఈసీ శ్రీహరి టి ఏ ఉమ్ల నాయక్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి




**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్** రూరల్‌దవీబీజీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసపురం గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోసనబోయిన హుస్సేన్ మాట్లాడుతూ.. కొత్త చట్టంలో 125 రోజులు పని కల్పిస్తామని చెబుతూనే కేంద్ర నిధుల వాటాను తగ్గించడం వల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. రెండుసార్లు ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి, రోజువారీ కూలి రూ.800 ఇవ్వాలని, కరువు మండలాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తంగెళ్ల వెంకట చంద్ర, తంగిళ్ళ గోపరాజు, నూకల లక్ష్మీ నరసమ్మ, కట్ట కృష్ణారావు, పారుపల్లి శ్రీనివాస్, జింకల గోపి తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం డిపోలో టీఎంయూ ఎన్నికల ప్రచారం



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్** టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో మహేశ్వరం డిపోలో టీఎంయూ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న లక్ష్మారెడ్డి నాయకత్వంలో జరిగిన సమావేశంలో టీఎంయూ బాణం గుర్తుకు ఓటు వేసి మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, యూనియన్ సలహాదారు ఎరగాని నాగన్న గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మొగుళ్ల రాజిరెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, సామా భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ 9న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రచారం నిర్వహించారు.

# మంగాపురంలో గ్రామసభ -- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు




**శుభోదయ డైనమిక్ న్యూస్, హుజూర్ నగర్** గరిడేపల్లి మండలం మంగాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బత్తిని అంజయ్య గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వికసిత్ గ్రామ పంచాయత్ ప్లాన్ ఆధ్వర్యంలో ఉపాధి, అభివృద్ధి పనులపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమిత్ర, ఉపసర్పంచ్ భాషా నాయక్, వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA